సాక్షి
వరంగల్
గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



ప్రేమను పంచారు.. ఎత్తుకెళ్లారు
పని ప్రదేశంలో పక్కపక్కనే ఉంటూ చిన్నారిపై ప్రేమను పంచి నమ్మించారు. ఆంధ్రకు చెందిన దంపతులు 10 నెలల పాపను అపహరించారు. - 8లో▸



అడుగడుగునా గుంతలు - 9లో▸
వరంగల్–విజయవాడ రైల్వే మార్గంలో ఎల్గూర్ రంగంపేట వద్ద ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ స్థానంలో ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జి గుంతలమయంగా మారింది.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
$34^0/21^0$
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి ఉక్కపోత ఉంటుంది. రాత్రి ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

శతాధిక వృద్ధురాలి మృతి



లచ్చమ్మ(ఫైల్)

ఖానాపురం: మండలంలోని బుధరావుపేటలో బుధవారం రాత్రి శతాధిక వృద్ధురాలు మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పులిగిల్ల లచ్చమ్మ(101) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యులంతా కలిసి కొద్ది నెలల క్రితం శతాధిక వేడుకలను సైతం నిర్వహించారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, నలుగురు కుమారులు సంతానం.

అమెరికాలో ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన

కేయూ క్యాంపస్: అమెరికాలో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఈనెల 27న సాయంత్రం 4.30 గంటలకు కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలనాభవనం సెనెట్‌హాల్‌లో నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం పాల్గొననున్నారు. 'హిజ్ సక్సెస్ అండ్ ట్రాన్సిషన్ ఫ్రమ్ ఎ సోషల్ సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ టు ఐటీ అండ్ బిజినెస్'అనే అంశంపై కేయూ పూర్వ విద్యార్థి, యూఎస్ బెస్ట్ బిజినెస్‌మెన్ రవి పులి ఉపన్యసిస్తారు. 'అకడమిక్ అడ్వాన్స్‌మెంట్ అపార్చునిటీస్ ఇన్ యూఎస్'అనే అంశంపై హైదరాబాద్‌లోని యూఎస్ ఎంబసీ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ ప్రసంగిస్తారని కార్యక్రమ అధ్యక్షుడు ఎన్.ప్రసాద్, కన్వీనర్ డాక్టర్ రమణ, కోకన్వీనర్ కె.భిక్షా తెలిపారు. విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు, ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్, సిద్దిపేట, తరిగొప్పుల, పాలకుర్తి, నిజామాబాద్, కరీంనగర్ రూట్ ప్రయాణికులు 9959226047 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని, సలహాలు, సూచనలు అందించాలని ఆయన కోరారు.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు



ఖిలా వరంగల్: బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం దాడులు చేసి రూ.1,21,540 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బార్లు, వైన్ షాపులు వేసివేశారు. దీంతో ముందుగానే వరంగల్ సాకరాశికుంటకాలనీలోని పలువురు తమ ఇళ్లలో భారీగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీకి విశ్వసనీయ సమాచారం అందింది. ఆయన ఆదేశాల ప్రకారం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో మద్యం నిల్వ చేసిన ఇళ్లు, బెల్ట్‌షాపులపై దాడులు చేశారు. సాకరాశికుంటకు చెందిన ఎనుగందుల శంకర్, ఎనుగందుల సృజన వద్ద రూ.65,790 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. శివ వైన్స్ ఓనర్ పరారీలో ఉండగా.. సాకరాశికుంటకు చెందిన చింత రాధిక వద్ద రూ.55,750 విలువైన మద్యాన్ని పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నంకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు.

కాళోజీ కళాక్షేత్రంలో వసతులు కల్పించాలి

హన్మకొండ కల్చరల్: కాళోజీ కళాక్షేత్రంలో వసతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర నాటక కళా కారుల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం అన్నారు. సహృదయ సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నాలుగు రోజులు గా జరుగుతున్న తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు బుధవారం ముగిశాయి. సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆకుల సదానందం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా 'జనరల్ బోగీలు', 'రుతువు లేని కాలం' నాటక ప్రదర్శనలు అలరించాయి. టెంపుల్ డ్యాన్స్ నిర్వాహకురాలు కాట్రగడ్డ హిమాన్సీ చౌదరికి సహృదయ రంగస్థల పురస్కారం ప్రదానం చేశారు.



సంగెం: సంఘమేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన మంచు శివ లింగం



వరంగల్ కాశీవిశ్వేశ్వరాలయంలో దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



పూలతో అలంకరించిన శివలింగం

నాగేంద్ర హారాయ.. త్రిలోచనాయ

జిల్లాలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- శైవక్షేత్రాల్లో మార్మోగిన శివనామస్మరణ
- అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- లింగోద్భవ కాలంలో నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం

జిల్లాలో మహాశివరాత్రి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ నగరం, నర్సంపేట, వర్ధన్నపేట, మండల కేంద్రాలు, గ్రామాల్లోని శైవక్షేత్రాలు తెల్లవారుజాము నుంచే కిటకిటలాడాయి. భక్తులు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పూజలు చేశారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. జిల్లా కేంద్రంలోని కాశిబుగ్గ కాశీవిశ్వేశ్వరాలయం, స్వయంభూ శంభులింగేశ్వరాలయం క్యూలో రద్దీ భారీగా పెరిగింది. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో అర్చకులు నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. జాగరణ చేసిన భక్తుల కోసం ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట రూరల్: మాదన్నపేట చెరువు కట్టపై ఉన్న రామలింగేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

- మరిన్ని వివరాలు, ఫొటోలు 8, 9లో▸



● ఆకలి యాత్ర..!

అంగవైకల్యంతో నడవలేని స్థితిలో ఒకరు.. ఆ దివ్యాంగుడి బండిని లాగుతూ మరొకరు.. నిరంతర ప్రయాణం చేస్తూ ఆకలి యాత్ర కొనసాగిస్తున్నారు. బుధవారం నర్సంపేట పట్టణంలో కన్పించిన వీరిని 'సాక్షి' పలకరించగా.. తమది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సుల్తాన్‌పూర్‌లోని సలేంపూర్ అని హిందీ భాషలో తెలిపారు. దివ్యాంగుడి పేరు చంద్రేశ్ అని బండి లాగుతున్న వ్యక్తి పేరు మిసాల్ అని.. తాము వెళ్లిన ఊర్లో ఎవరైనా తినడానికి ఆహారం ఇస్తే తిని రోజులు గడుపుతామని తమ బాధను చెప్పుకోచ్చారు.
– నర్సంపేట

అందని వేతనాలు

కూలికెళ్లినా.. పూటగడవడంలేదంటున్న స్కావెంజర్లు
- జీతాలు రాక ఏడు నెలలు..
- కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆవేదన



నల్లబెల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న స్కావెంజర్



రంగపురం హైస్కూల్‌లో చెట్టుకు నీళ్లు పోస్తున్న స్కావెంజర్ దేవేంద్ర

నల్లబెల్లి: పాఠశాల పరిసరాలు, టాయిలెట్స్ శుభ్రం చేస్తూ.. చెట్లకు నీళ్లు పడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్న స్కావెంజర్లు వేతనాలు అందకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఏడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కూలీ పనులకు వెళ్లినా పూట గడవడం ఇబ్బందిగానే ఉండడంతో పలుచోట్ల ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆర్థికసాయం చేస్తుండగా.. ఇప్పటికైనా వేతనాలు విడుదల చేయాలని స్కావెంజర్లు కోరుతున్నారు.

జిల్లాలో 637మంది స్కావెంజర్లు
ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా జిల్లాలో 13 మండలాల్లో 637 మంది స్కావెంజర్లను జూలై 2024లో నియమించింది. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వీరికి వేతనాలు అందించాలని నిర్ణయించింది. అయితే ఎంపికైన నాటి పాఠశాల పరిసరాలు శుభ్రం చేయడం, టాయిలెట్స్ క్లీన్ చేయడం, చెట్లకు నీరు పట్టడం తదితర పనులు చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వేతనం చెల్లిస్తామంటే ఆశతో పనులు చేస్తున్న స్కావెంజర్లకు వేతనాలు సక్రమంగా రాకపోవడంతో నిరాశే మిగిలింది. ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. వేతనాలు సక్రమంగా చెల్లించకపోడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని సంబంధిత అధికారులను వేడుకున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వేతనాలు అందించేలా కృషి చేయాలని కోరుతున్నారు.

వేతనాలు ఇలా..

విద్యార్థుల సంఖ్య	చెల్లించాల్సిన వేతనం
1 నుంచి 30 వరకు	రూ.3 వేలు
31 నుంచి 100 వరకు	రూ.6 వేలు
101 నుంచి 250 వరకు	రూ.8 వేలు
251 నుంచి 500 వరకు	రూ.12 వేలు

జిల్లాలో స్కావెంజర్ల వివరాలు..

మండలం	స్కావెంజర్ల సంఖ్య
చెన్నారావుపేట	37
దుగ్గొండి	36
గీసుగొండ	42
ఖానాపూర్	28
ఖిలా వరంగల్	78
నల్లబెల్లి	36
నర్సంపేట	59
నెక్కొండ	49
పర్వతగిరి	39
రాయపర్తి	54
సంగెం	36
వరంగల్	91
వర్ధన్నపేట	52
మొత్తం	637

ప్రతి నెల వేతనాలు ఇవ్వాలి



విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పిస్తున్న మాకు ఏడు నెలలుగా వేతనాలు అందడంలేదు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వేతనం అందిస్తామని అమ్మ ఆదర్శ కమిటీ వారు చెప్పి పనిలో పెట్టుకున్నారు. వారు చెప్పిన పనులన్నీ చేస్తున్నాం. వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నాం. అధికారులు స్పందించి వేతనాలు ఇచ్చేలా చూడాలి. – కనకం శిరీష, స్కావెంజర్, పీఎస్ నల్లబెల్లి

పెండింగ్ వాస్తవమే..



పాఠశాలల్లో స్కావెంజర్లను ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా నియమించింది. స్కావెంజర్ల గౌరవ వేతనం చెల్లింపులు పెండింగ్ వాస్తవమే.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా త్వరలోనే గౌరవ వేతనాలు చెల్లిస్తాం. – జ్ఞానేశ్వర్, డీఈఓ

సర్వం సిద్ధం..

నేడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్
- ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్



ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్:

నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యా య నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ నిర్వహణకు కావాల్సిన ఎన్నికల సామగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యశారద బుధవారం సందర్శించారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీరు, భోజన వసతి, షామియానాలు ఇతర వసతులు కల్పించగా.. పీఓ, ఓపీఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా పోలింగ్ ప్రక్రియను జరిపించాల్సిన తీరు గురించి, వెంట తీసుకెళ్లాల్సిన బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సామగ్రి గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల విధులు నిర్వహించడానికి పంపిణీ కేంద్రానికి వచ్చిన పీఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్లు, అధికారులు పోలింగ్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సిబ్బందికి సామగ్రిని అందించాలని, చెక్ లిస్టు ప్రకారం సామగ్రిని సరిచూసుకోవాలని సూచించారు. పోలింగ్ సిబ్బందితోపాటు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బస్సులను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 2,352 మంది ఉన్నారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగివారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్'లో ముందంజ

- సిటిజన్ ఫీడ్‌బ్యాక్ టాప్–100లో వరంగల్‌కు నాలుగో స్థానం
- మార్చి 5 వరకు ప్రజలు అభిప్రాయాలు వెల్లడించేందుకు అవకాశం



వరంగల్ అర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్–2024–25 సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో వరంగల్ నగరం ముందంజలో దుసుకెళ్తోంది. దేశవ్యాప్తంగా వంద నగరాల్లో వరంగల్ నాలుగో స్థానంలో నిలిచినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రకటించింది. మార్చి 5 వరకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్, డాక్యుమెంటేషన్, ఓడీఎఫ్, క్షేత్రస్థాయిలో పరిశీలన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు ఫలితాలను కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ అధికారికంగా పూర్తిస్థాయిలో వెల్లడిస్తుంది. దేశవ్యాప్తంగా 10 లక్షల్లోపు జనాభా ఉన్న నగరాల్లో ఇప్పటి వరకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ వివరాలు తెలిపారు. ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ప్రకారం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో 8,02,969 మంది ఉండగా 54,325 మంది నగర పరిశుభ్రతపై ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. రెండోస్థానంలో గ్రేటర్ విశాఖలో 8,02,947 మందికి 49,412 మంది, మూడోస్థానంలో మహారాష్ట్రలోని పింపిరి చించివాడ్‌లో 8,02,811 మందికి 47,790 మంది తమ అభిప్రాయాలు వెల్లడించారు. నాలుగో స్థానంలో గ్రేటర్ వరంగల్‌లో 8,09,930 మందికి 33,833 మంది వివరాలు తెలిపారు.

మెరుగైన ర్యాంకు సాధిస్తాం : గుండు సుధారాణి, నగర మేయర్
స్వచ్ఛ సర్వేక్షణ్–2024–25 సిటిజన్ ఫీడ్‌బ్యాక్ విభాగం (పౌరుల అభిప్రాయం) జాతీయస్థాయిలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు నాలుగో స్థానం దక్కినందుకు మేయర్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా టాప్–100 యూఎల్‌బీలు సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో సాధించిన స్కోరు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ర్యాంకుల్లో గ్రేటర్ వరంగల్ ఉత్తమ ఫలితాలు సాధించిందని ఆమె పేర్కొన్నారు. మార్చి 5 వరకు ప్రజలు వారి అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఇందుకోసం ప్రజారోగ్య సిబ్బంది ప్రత్యేక చొరవ చూపి నగరవాసులను ఇందులో భాగస్వామ్యం చేసి మొదటి స్థానం దక్కేలా ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని సూచించారు.

ఇదే స్ఫూర్తి కొనసాగించాలి: అశ్విని తానాజీ వాకడే, గ్రేటర్ వరంగల్ కమిషనర్
నగర ప్రజలు ఇదే స్ఫూర్తి కొనసాగించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే కోరారు. సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లో నగరానికి నాలుగో స్థానం దక్కడంతో కమిషనర్ హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. ఈ విభాగంలో మొదటి స్థానం వచ్చేందుకు అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు. తద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్–2024–25లో ఉత్తమ ర్యాంకు సాధనకు ఫీడ్‌బ్యాక్ దోహదం చేసే అవకాశం ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు.

రైతన్న గుబులు

- నెల తిరక్కముందే కుళ్లిపోతున్న వరినాట్లు
- చీడపీడలు.. తెగుళ్లే కారణం
- జాగ్రత్తలు పాటించాలంటున్న శాస్త్రవేత్తలు



నాటిన కొద్దిరోజులకే కుళ్లిపోయిన వరినాటు

దుగ్గొండి: వర్షాకాలం సన్నధాన్యానికి మంచి ధరతోపాటు ప్రభుత్వం బోనస్ ఇవ్వడంతో యాసంగిలో రైతులు ఉత్సాహంతో సన్న వరిధాన్యం రకాలను సాగు చేశారు. కానీ ఆదిలోనే అన్నదాతలకు దిగులు మొదలైంది. నాటు వేసి నెల తిరక్కమందే పంటంతా ఎర్రబడి చనిపోతుంది. దీంతో రైతులు గుబులు చెందుతున్నారు. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 58,600 ఎకరాల్లో వరి సాగుచేశారు. కొన్నిచోట్ల వరి పంట 15 నుంచి 70 రోజుల వయసులో ఉంది. అయితే నాటువేసిన 15వ రోజు నుంచి మొగిపురుగు, అగ్గితెగులు, వేరుకుళ్లు తెగుళ్ల ఆశించి పంటంతా కుళ్లిపోతుంది. దీంతో పంటను కాపాడుకునేందుకు నర్సంపేట ఏడీఏ దామోదర్ రెడ్డి, శాస్త్రవేత్తలు రైతులకు సూచనలిస్తున్నారు.

కాండం తొలుచుపురుగు..
నారుమడిలో.. మొక్కలు పిలకదశలో ఉన్నపుడు ఈ పురుగు ఆశిస్తే మొక్కలు చనిపోతాయి. అంకురం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే తెల్లకంకులు అవుతాయి. ముదురు నారు నాటడం, నీటి తడులు సరిగా అందకపోవడం, రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం, సూర్యరశ్మి అందకపోవడం, నత్రజని తక్కువగా వాడటం పురుగు ఆశించడానికి అనుకూలంగా ఉంటుంది. పురుగు ఉధృతిని గుర్తించడానికి ఎకరాకు 8 లింగార్షక బుట్టలను ఏర్పాటు చేయాలి. పిలకలు, లేదా దుబ్బు దశలో ఎకరాకు 10 కిలోల 3జి గుళికలు వేయాలి. చిరుపొట్ట దశలో క్లోరంట్రానిలిప్రోల్ మందును లీటరు నీటికి 0.3 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి.

అగ్గి తెగులు..
వరిపైరు ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా పెద్ద మచ్చలుగా మారి ఒకదానికొకటి కలిసిపోయి ఆకులు ఎండిపోతాయి. దూరం నుంచి చూస్తే పంట తగలబడినట్లు కనబడుతుంది. దీని నివారణకు యూరియాను తగ్గించి దఫాలుగా వాడాలి. చిరుపొట్ట దశ దాటిన తర్వాత ఎరువులను వాడకూడదు. లీటరు నీటికి 0.6 మిల్లీగ్రాముల ట్రైసైక్లజోల్ మందును కలిపి పిచికారీ చేయాలి.

జింక్ లోపం..
వరిలో జింకుదాతు లోపం వల్ల మొక్కల్లో పైనుంచి 3 లేదా 4 ఆకుల మధ్యన ఈనే పాలిపోతుంది. ఆకులపై ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. నత్రజని ఎరువులు వేసినా పైరు పచ్చబడదు. నివారణకు వరిపండించే భూముల్లో ప్రతి మూడు పంటలకు ఒకసారి ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను వేయాలి. లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి వరి పైరుపై 5 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలి. జింక్ సల్ఫేట్ పిచికారీ సమయంలో ఎలాంటి ఇతర మందులను కలపరాదు. ఇదిలా ఉండగా.. నేలలో సల్ఫైడ్(గంధకం) ఎక్కువ ఉండటం వల్ల వరి పంట ఈమధ్య కాలంలో బాగా పెరిగిన పంట గుంపులుగా మొత్తం పసుపు వర్ణంలోకి మారతుంది. నేల మెత్తగా మారుతుంది. నేలనుండి దుర్గంధపు వాసన వస్తుంది. మొక్క వేర్లు కుళ్లిన కోడిగుడ్డు వాసన వస్తాయి. నీటి ముంపు, తగిన రీతిలో పంట వేర్లకు గాలి అందకపోవడం, నేలలో ఇనుము లభ్యం కాకపోవడం, బరువు నేలల్లో గతంలో గంధకం ఉన్న 20–20–0–15 ఎరువులు అధికంగా వాడటం వల్ల సల్ఫేడ్ నేలలో ఎక్కువై వేర్లు కుళ్లిపోతాయి. మొక్కల వేర్లకు తగినంత గాలి తగిలే విధంగా మురుగు నీటిని తీసివేయాలి. పొలాన్ని సన్నని నెర్రెలు వచ్చే వరకు ఆరబెట్టి మళ్లీ నీరు పారిస్తే ఈ సమస్యను నివారించవచ్చు.

పాము కాటుతో చిన్నారి మృతి

- గిద్దెముత్తారంలో ఘటన


కీర్తన (ఫైల్)

చిట్యాల: పాముకాటుతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గిద్దెముత్తారంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రా మానికి చెందిన కిన్నెర శిరీష, రాజు దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె కీర్తన(7) ఉన్నారు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో ఏదో విషపురుగు తన చేతికి కుట్టిందని కీర్తన.. తండ్రికి చెప్పింది. దీంతో వెతకగా పింజర పాము కనిపించడంతో చంపేశారు. వెంటనే చిన్నారిని చిట్యాల సివిల్ ఆస్పత్రి, అటు నుంచి భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ ఘటనపై రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. కీర్తన మృతితో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దైవదర్శనానికి వెళ్లొస్తూ అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్తకు గాయాలు
- అన్నారం సమీపంలో ఘటన
- శివరాత్రి రోజున విషాదం


భాగ్యలక్ష్మి మృతదేహం

కాళేశ్వరం: దైవదర్శనానికి వెళ్లొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మహదేవపూర్ మండలం అన్నారం సమీపం మూలమలుపు వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం జంగేడుకు చెందిన సమ్మెట సమ్మయ్య, భాగ్యలక్ష్మి దంపతులు శివరాత్రి పండుగ సందర్భంగా స్కూటీపై శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుగుప్రయాణంలో అన్నారం సమీపం మూలమలుపు వద్ద స్కూటీ అదుపు తప్పి పడిపోయారు. ఈ ఘటనలో భాగ్యలక్ష్మి(50), సమ్మయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా వాహనం వచ్చి మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా భాగ్యలక్ష్మి మృతి చెందింది. సమ్మయ్యను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో పండుగపూట ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. కాగా, మూలమలుపు వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ఈ ఘటన జరిగిందని పలువురు ఆరోపించారు.

శంభో శివ శంభో..

రామప్పలో మార్మోగుతున్న శివనామస్మరణ

- ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు
- భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం
- రామలింగేశ్వరస్వామివారికి పంచామృతంతో అభిషేకాలు


రామప్ప గర్భగుడి వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై సతీశ్

వెంకటాపురం(ఎం): శంభో శివ శంభో.. హరహర మహాదేవ.. ఓం నమఃశివాయ అంటూ శివనామస్మరణతో రామప్ప మార్మోగుతోంది. ఆలయంలో మూడురోజుల పాటు జరగనున్న (బుధ, గురు, శుక్రవారం) మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచే భక్తులు కుటుంబసమేతంగా తరలివచ్చి రామలింగేశ్వరస్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలోని శివలింగం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షణలు చేశారు. కనుల పండువగా జరిగే శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు జాగరణ చేపట్టిన వారితోపాటు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఎటుచూసినా భక్తజన సందోహంతో రామప్ప కిక్కిరిసింది. మధ్యాహ్నం 12గంటల వరకే అంచనా మించి భక్తులు తరలిరావడంతో అభిషేక పూజలు నిలిపివేశారు. భక్తులందరికీ సాధారణ దర్శనం కల్పించారు. క్యూలో చెల్పూరుకు చెందిన బాలుడు ఊపిరి ఆడక సొమ్మసిల్లిపోవడంతో వైద్యసిబ్బంది సేవలందించారు. ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, ఎంపీడీఓ రాజు ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా కందగడ్డ, అరటిపండ్లు అందించారు. పోలీసులు భక్తులను తనిఖీ చేసిన అనంతరమే ఆలయంలోకి అనుమతిస్తున్నారు. కాగా, రామప్ప గార్డెన్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ కేంద్రాన్ని ఎస్సై సతీశ్ ప్రారంభించారు. అలాగే, ప్రత్యేక వైద్యశిబిరం ద్వారా 284 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్సై సతీశ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ కవిత, ఈఓ బిల్లా శ్రీనివాస్, ఎంపీడీఓ రాజు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా అదనపు కలెక్టర్ సంపత్‌రావు.. రామలింగేశ్వరస్వామివారికి పూజలు నిర్వహించారు.

తొలిరోజు పూజలు..


మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు బుధవారం సుప్రభాతం, గణపతిపూజ, అఖండదీపారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ పూజారులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ తెలిపారు.


స్వామివారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

నేత్ర పర్వం.. గణపేశ్వరుడి కల్యాణం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొన్న ప్రముఖులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


దర్శనానికి బారులుదీరిన భక్తులు


విద్యుత్ వెలుగుల్లో కోటగుళ్లు

గణపురం : జయశంకర్‌భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లలో బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి జరిగిన శ్రీ భవాని సహిత గణపేశ్వరుడి కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు వేలాదిగా ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు గంగాధర్, నాగరాజు, శంకర్.. గణపతి పూజ, అఖండ దీపారాధన, రుద్రాభిషేకం నిర్వహించారు. జాగరణకు వచ్చిన భక్తుల కోసం ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కోటగుళ్ల ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలతో ధగధగ మెరిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై రేఖ అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది భద్రతాచర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక పూజలు చేశారు.

గణపేశ్వరుడిని సందర్శించుకున్న పలువురు..

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గణపురం మండలకేంద్రంలోని కోటగుళ్లలో గణపేశ్వరుడిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఓఎస్‌డీ బోనాల కిషన్ దంపతులు, డీఎస్పీ అవిరినేని సంపత్ రావు దంపతులు, భూపాలపల్లి సీఐ నరేశ్ దర్శించుకున్నారు.

ఓం నమో నమః శివాయ

వేయిస్తంభాల దేవాలయంలో కనులపండువగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

- నేత్రపర్వంగా శ్రీరుద్రేశ్వరస్వామిశ్రీరుద్రేశ్వరి అమ్మవారి కల్యాణం
- తెల్లవారుజాము వరకు కొనసాగిన లింగోద్భవ పూజలు
- స్వామివారిని దర్శించుకున్న లక్షలాది మంది భక్తులు

హన్మకొండ కల్చరల్ : నగరంలోని శ్రీరుద్రేశ్వర స్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం శివరాత్రిని పురస్కరించుకుని స్వామివారికి 11లీటర్ల పచ్చద్రాక్షరసంతో అఘోరాపాశుపత రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగుఉపేంద్రశర్మ, వేదపండితులు మణికంఠ శర్మ, అర్చకులు ప్రణవ్, సందీప్‌శర్మ ఉదయం 3 గంటల నుంచి సుప్రభాతసేవ, గణపతిపూజ, నిత్యవిధిహవనం నిర్వహించారు. 5 గంటల నుంచి శ్రీరుద్రేశ్వరస్వామి వారికి సామూహిక రుద్రాభిషేకాలు జరిగాయి. ఉదయం నుంచే భక్తుల రద్దీ మొదలైంది.

నేత్రపర్వంగా స్వామి, అమ్మవారి కల్యాణం..

సాయంత్రం 6.45 గంటలకు ధనిష్టా నక్షత్రయుక్త సింహలగ్నముహూర్తంలో శ్రీరుద్రేశ్వరస్వామి శ్రీరుద్రేశ్వరి అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, ప్రముఖ వ్యాపారి వద్దిజు వెంకటేశ్వరరావు దంపతులు తలంబ్రాలు సమర్పించారు. ఆలయ ఈఓ అనిల్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు గారేపల్లి మహేశ్వరశర్మ శివతత్వంపై ప్రసంగించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి, పేరిణి నృత్య ప్రదర్శనలు అలరించాయి.

భక్తిపారవశ్యంతో లింగోద్భవపూజ..

గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో రాత్రి 12 గంటలకు లింగోద్భవకాలంలో వేదపండితులు 111 నమకచమక రుద్రాలతో విష్ణుసూక్త లక్ష్మీసూక్త ఆంజనేయసూక్త షట్‌ప్రయోగముల మంత్ర యుక్తంగా 51 లీటర్ల ఆవుపాలతో, 51కిలోల పెరుగు, 51 కిలోల తేనె, 11కిలోల చక్కెర, 5కిలోల మంచినెయ్యి, వివిధ పండ్ల రసాలతో మహారుద్రాభిషేకం నిర్వహించారు.

ప్రముఖుల పూజలు..

వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు, వరంగల్ దేవాదాయశాఖ ఏసీ రామల సునీత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ దంపతులు, సిరిసిల్ల రాజయ్య, నగర మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.


స్వామివారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

కల్యాణం.. కమనీయం

వైభవంగా శ్రీశుభానంద, ముక్తీశ్వరుల పెళ్లి


ఉత్సవ మూర్తులకు కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు


ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, డీసీ సంధ్యారాణి తదితరులు

- పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొచ్చిన కలెక్టర్ రాహుల్‌శర్మ

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీశుభానంద–ముక్తీశ్వరుల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం 4.35 గంటలకు కలెక్టర్ రాహుల్‌శర్మ, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి ఈఓ కార్యాలయం నుంచి ముత్యాల తలంబ్రాలు ఎత్తుకొని కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. మొదటిసారి ఉత్తర రాజగోపురం బయట నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, ఉపప్రధాన అర్చకుడు పనకంటి పనకంటి ఫణీంద్రశర్మ, వెల్ది శరత్‌చంద్రశర్మ, సుబ్రహ్మణ్యశర్మ కల్యాణ తంతు జరిపించారు. కల్యాణ తంతు వీక్షించడానికి భక్తుల సౌకర్యార్థం ఎల్ఈడీ తెర ఏర్పాటు చేశారు. కలెక్టర్ దంపతులు కాళేశ్వరాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ మహేశ్, మాజీ ఎంపీపీ రాణిబాయి, మాజీ ఎంపీటీసీ మమత, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సీఐ రామచంద్రరావు, ఎస్సై తమాషారెడ్డి బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా మల్లన్న పెద్దపట్నం..


ఆలయంలో పెద్దపట్నం


పెద్దపట్నంపై నృత్యం చేస్తున్న శివసత్తులు

- ఒగ్గు సంప్రదాయ ప్రకారం స్వామి, అమ్మవార్లకు కల్యాణం
- తన్మయత్వంతో శివసత్తుల నృత్యాలు

ఐనవోలు: మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి సమర్పించే నిత్య పూజలతో పాటు గర్భాలయంలో లింగ రూపంలో ఉన్న స్వామి అర్ధ ప్రాణవట్టానికి వేకువజాము నుంచి అభిషేకాలు జరుగుతూనే ఉన్నాయి. ఉదయం సింహ వాహన సేవ, అష్టోత్తర శత కలశార్చన నిర్వహించారు.

భక్తుల పారవశ్యంతో పెద్దపట్నం..

శివరాత్రి సందర్భంగా ఒగ్గు పూజారుల గురువుల ఆధ్వర్యంలో నిర్వహించే పెద్దపట్నం మధ్యాహ్నం కనుల పండువగా సాగింది. నాట్య మండపంలో పెద్దపట్నం వేసిన తర్వాత ఉత్సవ మూర్తులతో అర్చకులు పట్నం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి ఒగ్గు సంప్రదాయంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. అనంతరం వేలాది మంది శివసత్తులు తన్మయత్వంతో ఒక్కసారిగా బండారి, కుంకుమ, పచ్చ పిండి, తెల్లపిండితో కూడిన పట్నంపై నృత్యాలు చేసి బండారి, కుంకుమలను చల్లుకుంటూ ఓలలాడారు. ఈ క్రమంలో పట్నం వేసిన బండారిని భక్తులు తమవెంట తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే, ఐఏఎస్ అధికారి

మహాశివరాత్రి సందర్భంగా ఐనవోలు శ్రీ మల్లికార్జునస్వామి వారిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారిని ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ పాల్గొన్నారు.

ప్రేమను పంచారు... పాపను ఎత్తుకెళ్లారు

- కూరగాయల మార్కెట్‌కు వెళ్తామని చెప్పి...చిన్నారితో పరారీ
- జనగామలో ఘటన


శివానితో తల్లి పార్వతి(ఫైల్)


పాపను తీసుకెళ్లిన సురేశ్ దంపతులు

జనగామ: రాష్ట్రాలు వేరైనా తోబుట్టువుల్లా కలిసిపోయారు.. పని ప్రదేశంలో పక్కపక్కనే ఉంటూ ఆప్యాయత పంచినట్టు నటించారు. నిత్యం పాపను ఆడిస్తూ సొంత వారనే నమ్మకం కలిగించారు. చివరికి కూరగాయల మార్కెట్‌కు వెళ్తొస్తామంటూ దంపతులు 10 నెలల పాపను తీసుకుని పరారయ్యారు. ఈ ఘటన జనగామ జిల్లా కేంద్రం కళ్లెం రోడ్డు కన్‌స్ట్రక్షన్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. బాధిత కుటుంబం, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ముంగేలీ గ్రామానికి చెందిన పార్వతి, రామ్‌జుల్ దంపతులు కళ్లెం రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం రెండు నెలల క్రితం కాంట్రాక్టర్ ద్వారా పని కుదుర్చుకుని ఇక్కడకు వచ్చారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 20 రోజుల క్రితం ఖమ్మంకు చెందిన సురేశ్, ప్రేమలత దంపతులు సైతం రావడంతో అంతా కలిసి పనులు చేస్తున్నారు. సురేశ్‌కు పిల్లలు లేకపోవడంతో, పార్వతి కుమార్తె అయిన శివాని(10నెలలు) అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. పని పూర్తి చేసుకున్న తర్వాత సురేశ్ ఎక్కడికి వెళ్లినా పాపను తనతో తీసుకెళ్తూ కుటుంబంలో ఒక్కరిగా నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీ (మంగళవారం) రాత్రి సురేశ్ దంపతులు కూరగాయల మార్కెట్‌కు వెళ్తున్నట్టు చెప్పి, వారి వెంట పాప శివానిని ఫంక్షన్ హాల్ యజమాని బైక్‌పై తీసుకెళ్లారు. గంటలు గడిచిపోతున్నా వారు రాకపోవడంతో బాధిత దంపతులు, సహచర కూలీలు ఫంక్షన్‌హాల్ యజమాని, కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన ఘటనపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి సురేశ్ గురించి వాకబు చేస్తున్నారు. సురేశ్‌ను తీసుకొచ్చిన కాంట్రాక్టర్ ద్వారా పూర్తి సమాచారం సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. రెండు రోజులుగా బిడ్డ కనిపించక తల్లి తల్లడిల్లి పోతుంటే.. తండ్రి రామ్‌జుల్ సహచర కూలీలతో చుట్టు పక్కల ప్రాంతాల్లో ఆరా తీస్తున్నారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. ఎవరికైనా నిందితుల ఆచూకీ తెలిసిన వారు 712685202,8712685259,8712685260 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రాజేశ్ పేర్కొన్నారు.

వీడిన వీరమ్మ మృతి మిస్టరీ..

- మంత్రాల నెపంతో వృద్ధురాలి హత్య
- ముగ్గురి అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సంపత్‌రావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల/టేకుమట్ల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి శివారులో ఈనెల 23న మృతి చెందిన వృద్ధురాలు వీరమ్మ కేసు మిస్టరీ వీడింది. మంత్రాల నెపంతో ఆమెను హత్య చేసినట్లు డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం చిట్యాల సర్కిల్ కార్యాలయంలో సీఐ మల్లేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సంపత్‌రావు నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి శివారు బోయినపల్లికి చెందిన సారపాక వీరమ్మ(70) ఈనెల 19న చింతపండు అమ్ముకుంటూ గర్మిళ్లపల్లికి వెళ్లి అదృశ్యమైంది. మరుసటి రోజు కుమారులు తల్లి కోసం పలుచోట్ల వెతకగా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో ఈనెల 23న బోయినపల్లి– గర్మిళ్లపల్లి గ్రామాల మధ్యలోని పసిక వనమ్మకు చెందిన వ్యవసాయ బావిలో నుంచి దుర్గంధం వస్తుందని గమనించిన ఓ బాటసారి బోయిని సంపత్ బావి వద్దకు వెళ్లి చూడగా ఓ గుర్తు తెలియని శవం నీటిపై తేలియాడుతోంది. దీంతో గ్రామస్తులకు సమాచారం అందించగా వారు వచ్చి చూసి సారపాక వీరమ్మగా గుర్తించారు. ఈ ఘటనపై కుటుంబీకులు టేకుమట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా గర్మిళపల్లిలోని సీసీ కెమెరాలు, ఇతర టెక్నికల్ సాక్ష్యాల ద్వారా కొంతమంది అనుమానితులను విచారిస్తుండగా.. వృద్ధురాలిని హత్య చేసిన నిందితులు బోయినపల్లికి చెందిన బోయిన మల్లయ్య, పుట్టకొక్కుల శ్రీనివాస్ అలియాస్ కిట్టు, గర్మిళపల్లికి చెందిన మద్దెల సిద్దు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయారు. బోయిని మల్లయ్య చిన్న కుమార్తె అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో ఇంటి పక్కనే ఉన్న వీరమ్మ మంత్రాలు చేస్తుందని అనుమానంతో ఆమెను హత్య చేసేందుకు రెండు నెలల క్రితమే పథకం వేశారు. వీరమ్మను చంపితే తన కూతురు ఆరోగ్యం బాగుపడుతుందని నమ్మిన మల్లయ్య తన బంధువు పుట్టకొక్కుల శ్రీనివాస్ అలియాస్ కిట్టు మరొకరు మద్దెల సిద్దు సాయం కోరగా వారు ఒప్పుకున్నారు. ఈనెల 19న గర్మిళ్లపల్లికి ఒంటరిగా వెళ్తున్న వీరమ్మను మల్లయ్య, శ్రీనివాస్, సిద్దు బైక్‌పై వెళ్లి వెంబడించారు. మార్గమధ్యలోని పసిక వనమ్మకు చెందిన బావివద్దకు రాగానే వీరమ్మను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి గొంతు నులిమి చంపారు. అనంతరం కాళ్లు, చేతులు కట్టి గోనె సంచిలో కుక్కి బావిలో పడేశారు. ఆమె శరీరంపై ఉన్న రెండు తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలను తీసుకుని పరారైనట్లు నిందితులు ఒప్పుకున్నారు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన చిట్యాల సీఐ మల్లేశ్, టేకుమట్ల ఎస్సై సుధాకర్, ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, రమేశ్, మహేందర్. నాగరాజు, రంజిత్, సతీశ్‌ను డీఎస్పీ సంపత్‌రావు అభినందించారు.

కుటుంబ కలహాలతో | కూతురుతో సహా బావిలో దూకిన తల్లి

- కూతురి మృతి.. ప్రాణాలతో బయటపడిన తల్లి
- జనగామ జిల్లాలో ఘటన


శ్రీప్రగతి (ఫైల్)


రోదిస్తున్న గౌరీప్రియ నానమ్మ కొమురమ్మ

జనగామ రూరల్: భార్యాభర్తల మధ్య గొడవ చివరికి తన కన్న బిడ్డనే దూరం చేసింది. క్షణికావేశంతో బిడ్డతో సహా తల్లి బావిలో దూకగా, బిడ్డ చనిపోగా, తల్లి ప్రాణాలతో బయటపడింది. ఈ విషాదకర ఘటన జనగామ జిల్లా జనగామ మండలం గానుగుపహాడ్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గానుగుపహాడ్ గ్రామానికి చెందిన ఆకుల రమేశ్‌కు, తరిగొప్పుల మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన గౌరీప్రియతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి పాప శ్రీప్రగతి (2)ఉంది. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు జరుగుతుండడంతో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో కూర్చొని మాట్లాడుకున్నారు. సమస్యలు పరిష్కరించుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో మళ్లీ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో గౌప్రియ బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో కూతురు శ్రీప్రగతిని తీసుకుని గ్రామంలోని తమ వ్యవసాయ బావిలో దూకింది. గమనించిన స్థానికులు వెంటనే బావిలోకి దూకి ఇద్దరిని బయటికి తీయగా, అప్పటికే పాప నీటిలో ఊపిరాడక మృతి చెందింది. తల్లి గౌరి ప్రియను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భర్త రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గౌరిప్రియ నానమ్మ కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజేశ్ తెలిపారు.